సాక్షి
వనపర్తి
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



లింగమయ్య దర్శనానికి బారులుదీరిన భక్తులు

న్యూస్‌రీల్

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కీమియాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయురాలు పి.భారతమ్మను సస్పెండ్ చేసినట్లు మండల విద్యాధికారి జయశంకర్ తెలిపారు. సమయపాలన పాటించకపోవడం, విద్యార్థులకు అకాడమిక్ సైడ్ రిజిస్టర్లు, ఎఫ్ఎల్ఎన్ నోటీస్ రిజిస్టర్, ఎండీఎం రిజిస్టర్, వర్క్‌బుక్ నిర్వహణ, అడ్మిషన్ రిజిస్టర్ల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల వినియోగంలో అవకతవకలు ఉన్నాయన్నారు. ఈ విషయమై 4వ తేదీన జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించడంతో పాటు నిధుల వినియోగంపై ఆరా తీశారని చెప్పారు. ఆయన సూచనల మేరకు శుక్రవారం ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ వివరించారు.

రామన్‌పాడులో 1,016 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,016 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వలో 285 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదని చెప్పారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 36 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 67 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

పాలెం డిగ్రీ కళాశాలలో సమూల మార్పులు



బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల (అటానమస్)లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శుక్రవారం 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి అకాడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు, యూనివర్సిటీ అకాడమిక్ డీన్‌లు, ప్రొఫెసర్లు, సబ్జెక్టు నిపుణులు, ఆయా ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరై అకాడమిక్ క్యాలెండర్ రూపకల్పన, సిలబస్‌ను అభివృద్ధి చేశారు. అంతేకాక పాఠ్యాంశాలను సమర్థవంతంగా అభివృద్ధి చేయడం, సవరించడం, ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్ష ఫీజుల నిర్ణయం, పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానం, మాడరేషన్, డిటెండ్ నియమాలు, వివిధ ప్రోగ్రాంల వివరణ, విద్యా సంబంధిత నిబంధనలు, ఇతర మార్గ దర్శకాలను రూపొందించారు. సమావేశంలో ప్రొఫెసర్లు చెన్నప్ప, జయపాల్‌రెడ్డి, పాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాములు, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, పెబ్బేరు కళాశాల ప్రిన్సిపల్ వెంకటప్రసాద్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు పద్మజ, శ్రీనివాసులు, నాగరాజు, సుష్మ, శివ, బోర్డు ఆఫ్ సబ్జెక్టు సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం జేబులో కృష్ణా ట్రిబ్యునల్



- పాలమూరు–రంగారెడ్డిని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వివరాలు 10లో ▶

నల్లమలలో జనజాతర



శివలింగానికి పూజ చేస్తున్న మహిళ



లోయలో కిక్కిరిసిన భక్తులు

అత్యంత వైభవంగా సలేశ్వరం ఉత్సవాలు

- మొదటిరోజు వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- మండుటెండల్లో సైతం వృద్ధులు, చిన్నారుల నడక
- పులుల అభయారణ్యంలో మార్మోగిన లింగమయ్య నామస్మరణ

అచ్చంపేట/ అచ్చంపేట రూరల్: తెలంగాణ అమరనాథ్‌గా ప్రసిద్ధిగాంచిన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభయ్యాయి. పున్నమికి ముందు రోజు మదినిండా లింగమయ్యను స్మరించుకుంటూ భక్తులు వేలాదిగా నల్లమల బాట పట్టారు. అటవీశాఖ శుక్రవారం నుంచి అనుమతిస్తామని చెప్పినప్పటికీ భక్తులు గురువారం మధ్యాహ్నం నుంచే ఫర్హాబాద్ గేటు వద్దకు చేరుకున్నారు. వ్యాపారులు ఇతరులు లోపలికి వెళ్లే క్రమంలో వీరు సైతం దూసుకెళ్లడంతో ఏమీ చేసేది లేక అటవీశాఖ అనుమతించారు. వస్తున్నాం.. లింగమయ్యా.. అంటూ చిన్నా పెద్ద తేడా లేకుండా దట్టమైన అడవిలో లోయలు, గుట్టలు, సెలయేర్లు దాటుకుంటూ సాహస యాత్రలో ఉత్సాహంగా ముందుకు కదిలారు. అటవీశాఖ ఆంక్షల నేపథ్యంలో భక్తులు భగభగ మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా పగటి వేళ లింగమయ్య దర్శనానికి భారీగా తరలివచ్చారు. మొదటిరోజు సుమారు 60 వేల మంది లింగమయ్య దర్శనం చేసుకున్నారు. ఆర్టీసీ బస్సులు మినహా సొంత వాహనాలు కలిగిన భక్తులను అటవీ, పోలీస్ అధికారులు రాత్రివేళ కూడా సాహస యాత్రకు అనుమతిస్తున్నారు. చైత్ర పౌర్ణమికి ముందు రోజు స్వామివారి దర్శనం కోసం భక్తులు తరలి రావడంతో నల్లమల దారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఐదురోజుల జాతరను అటవీశాఖ మూడు రోజులకు కుదించడంతో పగలు, రాత్రి తేడా లేకుండా భారీగా తరలివస్తున్నారు. చెంచు పూజారులు లింగమయ్యకు గిరిజన సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు చేశారు.



మోకాళ్ల కుర్వు వద్ద గుట్ట దిగి, ఎక్కుతున్న భక్తులు

బారులుదీరిన వాహనాలు

మన్ననూర్– ఫర్హాబాద్ నుంచి రాంపూర్‌పెంట వరకు వాహనాలు బారులుదీరాయి. మరో మార్గమైన అప్పాయిపల్లి– గిరిజనగుండాల జనసందోహంతో నిండుగా కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. లోయలో మదిని దోచే రీతిలో పైనుంచి జాలువారుతున్న నీటిధారలో యువకులు కేరింతలు కొడుతూ సేదదీరారు. ఆలయం, జలపాతం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా వలంటీర్లు పనిచేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

పోలీస్, అటవీ శాఖలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టింది. సీసీ, ట్రాప్ కెమెరాల ద్వారా అడవి మార్గంలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఫర్హాబాద్– రాంపూర్– సలేశ్వరం క్షేత్రం వరకు పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 5 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, 370 మంది పోలీస్, హోంగార్డులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో 130 మంది చెంచు వలంటీర్లు, అటవీ శాఖ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలని భక్తులకు సూచిస్తున్నారు.



ప్రమాదకరమైన ప్రాంతంలో ఇలా..

30 ప్రత్యేక బస్సులు

సలేశ్వరం జాతర మొదటి రోజు శుక్రవారం అచ్చంపేట డిపో నుంచి 30 ట్రిప్పులు.. నాగర్‌కర్నూల్ నుంచి మరో 15 ట్రిప్పులు నడిపించారు. పుల్లాయిపల్లి పెంట వరకు బస్సులు వెళ్తుండగా.. అక్కడి నుంచి ఆటోల ద్వారా మోకాళ్లకుర్వు వరకు ప్రయాణికులు వెళ్లి కాలినడకన దర్శనం చేసుకుంటున్నారు. ప్రయాణికులకు అనుగుణంగా రాత్రివేళ కూడా బస్సులు అనుమతించడంతో బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉన్నారు.



లింగమయ్య చెంతకు చిన్నారులు

అన్నదానం, తాగునీటి వసతి

సలేశ్వరం వచ్చే భక్తుల కోసం మోకాళ్ల కుర్వు, అప్పాయిపల్లి మార్గంలోని గిరిజన గుండాల వద్ద స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన సత్రాలు, చలివేంద్రాలు భక్తులను ఆదుకుంటున్నాయి. అల్పాహారం మొదలుకొని మధ్యాహ్నం, రాత్రి సమయంలో భోజనాలు, రాగి అంబలి, మజ్జిగ, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీటి ఏర్పాట్లు చేశారు. ఫర్హాబాద్ చెక్‌పోస్టు, పుల్లాయిపల్లి బేస్ క్యాంపు, రాంపూర్‌పెంట, మోకాళ్లకుర్వు (సలేశ్వరం), లింగాల మండలం అప్పాయిపల్లి, గిరిజన గుండాల వద్ద వాటర్ ట్యాంకులు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా దాతలు ఏర్పాటు చేసిన ఉచిత భోజనశాలలతోపాటు 20 ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. మూడురోజులపాటు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు డీఈ హేమలత తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే

వనపర్తి: వెనకబడిన వర్గాలు, మహిళల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం ముఖ్యఅతిథులుగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయమే ధ్యేయంగా ఆయన అనేక ఉద్యమాలు చేశారని, ఆశయాలు, లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పూలే తన సతీమణి సావిత్రీబాయికి చదువు నేర్పించి దేశంలో మొదటి బాలికల పాఠశాలను నెలకొల్పినట్లు గుర్తు చేశారు. ఆర్థికంగా మనం బాగున్నప్పుడే సామాజిక న్యాయం కోసం పోరాడగలమని చెప్పిన కలెక్టర్.. జ్యోతిబా పూలే ఆ రోజుల్లోనే పూణే నగరానికి పుర కమిషనర్‌గా పనిచేసినట్లు తెలిపారు. మన దేశంలో మహాత్మా అనే బిరుదు ఇద్దరికే దక్కిందని.. అందులో ఒకరు గాంధీ అయితే, మరొకరు జ్యోతిబా పూలే అన్నారు. జ్యోతిబా పూలే రాసిన కవితలు, పుస్తకాలు అందరూ చదివి ఆదర్శంగా తీసుకొని జీవితంలో గొప్పగా ఎదగాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జ్యోతిబా పూలే, ఆయన సతీమణి ఇద్దరూ సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని.. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆర్డీఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. 1827లో మహారాష్ట్రలో జన్మించిన జ్యోతిబాపూలే సమాజంలో అసమానతలు తొలగించడానికి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. బీసీ పొలిటికల్ జేఏసీ నాయకుడు రాచాల యుగంధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్న నాయుడు, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే..

అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, బలహీనవర్గాలు, మహిళా హక్కుల సాధనకు కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త, మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలందరికీ సమాన హక్కులు ఉండాలని మహిళలకు సైతం విద్యనందించి మొదటిసారిగా వారి హక్కుల కోసం పోరాడిన గొప్ప ఉద్యమకారుడు, సామాజిక తత్వవేత్త, సంఘ సేవకుడన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు సాయుధదళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఏఓ సునందన, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, డీసీఆర్బీ సీఐ రవిపాల్, రిజర్వ్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది

భూ సేకరణ వేగవంతం చేయాలి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భూ సేకరణ, పునరావాస కేంద్రాల ఏర్పాటుపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుద్ధారం పెద్ద చెరువు, గణపసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ సేకరణపై ప్రధానంగా చర్చించారు. బుద్ధారం పెద్ద చెరువుకు సంబంధించి 11.57 ఎకరాల భూమికి వారంలో అవార్డ్ పాస్ చేయడంతోపాటు ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. చెరువు లోపల అవసరమైన 205 ఎకరాల భూమికిగాను 109 ఎకరాలకు త్వరలో అవార్డ్ పాస్ చేయాలని, మిగిలిన 96 ఎకరాలకు సర్వే చేయించాలని ఆర్డీఓను ఆదేశించారు. సర్వే అనంతరం గ్రామసభ నిర్వహించాలన్నారు. గణపసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సర్వే పూర్తయిన 18 ఎకరాలు, మరో 388 ఎకరాల స్థలానికి అవార్డ్ పాస్ చేయాలని, ఇరిగేషన్‌శాఖ వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మిగిలిన 197 ఎకరాల సర్వే చేయించాల్సిందిగా సూచించారు. పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన వేగవంతంగా జరగాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇరిగేషన్‌శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ డి.కేశవరావు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి శతకుంభ తిలతైలాభిషేకం



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో వెలసిన జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరుడి 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు స్వామివారికి శతకుంభ తిలతైలాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి శుక్రవారం గణపతి పూజానంతరం జేష్ఠ్యాదేవి సమేత శనేశ్వరులకు వెయ్యి కుంభాలతో నువ్వుల నూనెతో ప్రత్యేక పూజలు, మహాన్యాస పూర్వక అష్టోత్తర సహిత అభిషేక పూజలు జరిపారు. కాగా.. శనివారం ఉదయం 9 గంటలకు ఉమామహేశ్వరస్వామి వ్రత ం, శాంతి హోమం, బలిహరణం, పూర్ణాహుతి, సాయంత్ర ఆలయం చుట్టూ బండ్ల ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు.

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

అమరచింత: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్నామని, రైతుల నుంచి వరి ధాన్యం సకాలంలో కొనుగోలు చేస్తున్నామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లిలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. నాగల్‌కడ్మూర్‌లోని దళితవాడలో సోనియమ్మ ఇంట్లో రేషన్ సన్నబియ్యంతో వండిన భోజనం అధికారులతో కలిసి చేశారు. గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, ఆ ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రూ.రెండు లక్షల పంట రుణమాఫీ, సన్నరకం వరి ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ అందించామన్నారు. యాసంగిలో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని.. రైతుల నుంచి వచ్చిన ప్రతి గింజా కొనడమే కాకుండా సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సీసీ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, బీటీ రహదారులతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని.. ప్రజా ప్రభుత్వంలో అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే తమ కర్తవ్యమన్నారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, తహసీల్దార్ రవికుమార్ యాదవ్, ఏపీఎం కృష్ణవేణి, ఏఓ అరవింద్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తిరుమల్లేశ్, మహంకాళి విష్ణు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి.. చిత్రంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

కనులపండువగా పంబ ఆరట్టు

వనపర్తిటౌన్: అయ్యప్ప జన్మదినం సందర్భంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో పంబ ఆరట్టు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించి పంబ ఆరట్టులో భాగంగా పవిత్ర జలాలతో చక్రస్నానం చేయించారు. భక్తుల శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. చక్రస్నానం అనంతరం మేళతాళాలు, వాయిద్యాలతో స్వామివారిని ఆలయ ప్రాంగణంలోకి తీసుకొచ్చి పల్లకీసేవ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో ప్రారంభమై లక్ష్మీ గణపతి హోమం, మూల విగ్రహానికి ఆలయ ప్రధాన అర్చకుడు రమేష్‌శర్మ అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తికి 3 గంటల పాటు అభిషేకాలు నిర్వహించారు. తర్వాత ఆలయంలోని మూలమూర్తికి సహస్ర నామార్చన, మహా మంగళహారతి, భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాలు తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

ఆధ్యాత్మికతే శరణ్యం..

ఆత్మశుద్ధికి ఆధ్యాత్మికతే శరణ్యమని బిజ్వారం అంబత్రేయ క్షేత్ర పీఠాధిపతి డా. ఆదిత్య పరాశ్రీ అన్నారు. శుక్రవారం రాత్రి ఆలయంలోని ఏకశిల పడికి పూజ నిర్వహించి సందేశమిచ్చారు. సనాతన ధర్మం ఎంతో గొప్పదని.. అందులోని ప్రతి అంశం లోక కళ్యాణం, సర్వమానవాళి శ్రేయస్సే లక్ష్యమని తెలుసుకోవాలన్నారు. భక్తిభావంతో పాటు ధర్మ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో భక్తిభావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.



ఏకశిల పడిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

108 ఇటుకలకు పూజలు..

కొత్తకోట రూరల్: మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప క్షేత్రంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజ్వారం అంబత్రేయ క్షేత్ర పీఠాధిపతి డా. ఆదిత్య పరాశ్రీ హాజరయ్యారు. హరిహర పుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్ర నిర్మాణంలో సమస్త భక్తులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో 108 ఇటుకలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఇటుకలను ఆదిత్య పరశ్రీ గురూజీ భక్తులకు అందజేశారు. ఆ ఇటుకలకు ఇంట్లో11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి తదనంతరం అందజేయాలని ఆలయ నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు దూపం నాగరాజు, పొగాకు అనిల్‌కుమార్, విశ్వనాథం గంగాధర్‌శెట్టి, భీమకిషోర్‌కుమార్, బలిజ లింగేశ్వర్, వేముల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

వనపర్తి: డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ రావుల గిరిధర్ కోరారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు, వాటి కార్యకలాపాలపై దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ల్యాబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. డ్రగ్స్ వినియోగంతో శరీరంలో శక్తి తగ్గుతుందని.. మంచి భవిష్యత్‌ను కోల్పోతారని, సమాజంలో చెడ్డ పేరు వస్తుందన్నారు. ల్యాబ్ ఏర్పాటుకు కృషి చేసిన ఎస్ఐ అంజద్‌ను ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సాయుధదళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, సీసీఎస్ సీఐ రవిపాల్, సీఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు..

ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. హనుమాన్ శోభాయాత్రకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన చౌరస్తాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. సీసీ కెమెరాల నిఘా ఉంటుందని.. కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా అనవసర పోస్టులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచాలని, ర్యాలీ జరిగే సమయంలో వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వాహనాలను మళ్లించాలని సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు వాలంటీర్లను ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పోలీసులకు సహకరించాలని కోరారు. అత్యవసర సమయాల్లో స్థానిక పోలీసులు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

క్లుప్తంగా

ఉపాధి పనులకు వెళ్తూ.. మహిళా కూలీ మృతి


జయమ్మ (ఫైల్)

మహమ్మదాబాద్‌: ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తూ ఓ మహిళా కూలీ మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహమ్మదాబాద్‌కు చెందిన మాల జయమ్మ(55) ఉపాధి కూలీకి వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేది. ఈ క్రమంలో శుక్రవారం సైతం పాంపాండ్‌ పనుల కోసం ట్రాక్టర్‌పై వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే అకస్మాత్తుగా జయమ్మ సొమ్మ సిల్లిపడిపోగా.. వెంటనే ప్రాథమిక ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమె వడదెబ్బ కారణంగా మృతిచెందిందా.. లేక అనారోగ్యంతో మృతిచెందిందా అన్నది తేలాల్సి ఉంది. జయమ్మకు భర్త జయప్రకాశ్‌, ఒక కుమారుడు ఉన్నారు. అధికారులు వివరాలు సేకరించి తగిన సహాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

కాంక్రీట్‌ మిషన్‌ ఢీకొని వ్యక్తి దుర్మరణం

గద్వాల క్రైం: కాంక్రీట్‌ మిషన్‌ ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గద్వాల మండలం కొండపల్లికి చెందిన రైతు తెలుగు వెంకటన్న (53) మహిళా రైతు లక్ష్మితో కలిసి శుక్రవారం ఉదయం బ్యాంకు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పూడూరుకు బయలుదేరారు. 99వ ప్యాకేజీ కాల్వ వద్ద సీసీ పనులకు వినియోగిస్తున్న కాంక్రీట్‌ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో వెంకటన్నకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మహిళకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

యువకుడి బలవన్మరణం


రామకృష్ణ (ఫైల్)

మల్దకల్‌: ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన కుర్వ రామకృష్ణ (24)కు ఆరేళ్ల కిందట కృష్ణవేణితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో గద్వాలకు చెందిన ట్రాన్స్‌జెండర్‌ శ్రీవాణితో పరిచయం ఏర్పడింది. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు రావడంతో శుక్రవారం తెల్లవారుజామున శ్రీవాణితో పాటు మరో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఇంటికి వెళ్లారు. అప్పటికే రామకృష్ణ ఉరేసుకొని వేలాడుతూ కనిపించడంతో వెంటనే ప్రత్యేక వాహనంలో చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ట్రాన్స్‌జెండర్‌ వేధింపులతోనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని.. మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. గతంలో జిల్లాకేంద్రంలో ట్రాన్స్‌జెండర్‌ వేధింపులతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మరువక ముందే మల్దకల్‌లో మరో సంఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ నందికర్‌ వివరించారు.

ఇల్లు దగ్ధం.. త్రుటిలో తప్పిన ప్రమాదం

మక్తల్‌: వంట గ్యాస్‌ లీకేజీతో మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని కర్నిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన రాంపూర్‌ నర్సింహులు తన ఇంట్లో కొంత భాగాన్ని బీరప్ప భక్తులకు అద్దెకిచ్చాడు. శుక్రవారం ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్‌ లీకేజీ ఏర్పడి మంటలు చెలరేగగా చుట్టుపక్కల వారు గమనించి ఆర్పివేశారు. అప్పటికే ఫ్యాన్‌, బీరువా, నిత్యావసర సరుకులతో పాటు ఇంటి పైకప్పు రేకులు కాలిపోయాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మాగనూర్‌: విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మాగనూరు మండలంలోని అడవిసత్యారంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం సింధనూర్‌కు లక్ష్మణ్‌ (40) కొంతకాలంగా కృష్ణ మండలం చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర వరికోత మిషన్‌కు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం యాసంగి వరి కోతల నేపథ్యంలో అడవిసత్యారం గ్రామ శివారులో వరికోత పనులు సాగిస్తుండగా.. పొలంలోని విద్యుత్‌ వైర్లు మిషన్‌కు తాకడంతో దానిపై ఉన్న లక్ష్మణ్‌ విద్యుదాఘాతానికి గురై.. అక్కడికక్కడే మృతి చెందాడు. ముందుగా ఈ విషయాన్ని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేసినా.. గ్రామంలో ఆనోటా ఈ నోటా పడి.. అందరికి తెలిసింది. దీంతో మృతదేహాన్ని మక్తల్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

టాస్‌ కోఆర్డినేటర్‌ నియామకంపై వివాదం

- అక్రమంగా కేటాయించారని జీటీఏ సంఘం నాయకుల ఆరోపణ
- ఎవరికైనా ఇవ్వొచ్చని జేఏసీ నాయకుల వాదన
- స్పష్టత కోసం విద్యాశాఖ కమిషనర్‌కు ఫైల్‌ పంపిన డీఈఓ


డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న జేఏసీ నాయకులు

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: విద్యాశాఖలో టాస్‌ (తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ సొసైటీ) ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ పోస్టు కేటాయింపు విషయంలో రెండు సంఘాల మధ్య ఫిర్యాదుల పర్వం కొనసాగుతుంది. మొదట జీటీఏ (గవర్నమెంట్‌ టీచర్స్‌ అసోసియేషన్‌) నాయకులు టాస్‌ కోఆర్డినేటర్‌ నియామకం అక్రమం అని, 1972లో విడుదల చేసిన జీఓ 1214 ప్రకారం కేవలం గవర్నమెంట్‌ టీచర్స్‌కే కేటాయించాలని స్పష్టంగా ఉన్నప్పటికీ గత డీఈఓ నిబంధనలను పట్టించుకోకుండా అడ్డగోలుగా కేటాయించారని నాయకులు పలుమార్లు కలెక్టర్‌, డీఈఓకు సైతం ఫిర్యాదు చేశారు. కామన్‌ సర్వీస్‌ రూల్స్‌ లేనందున లోకల్‌ బాడీ వారికి లోకల్‌ బాడీలో, గవర్నమెంట్‌ వారికి గవర్నమెంట్‌లో మాత్రమే కేటాయించాలని, డీఈఓ కార్యాలయం పూర్తిగా గవర్నమెంట్‌ పరిధిలో ఉంటుంది కాబట్టి లోకల్‌ బాడీలో ఉన్న ఉపాధ్యాయుడికి టాస్‌ కోఆర్డినేటర్‌ పోస్టు కేటాయించవద్దని పేర్కొంటున్నారు.

■ ఇదిలా ఉండగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన జేఏసీ నాయకులు డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1214 జీఓ ప్రకారం లోకల్‌ బాడీ, గవర్నమెంట్‌ బాడీలో వారు ఎవరైనా కూడా ఆ పోస్టుకు అర్హులేని, ఎవరినైనా ఆ పోస్టులో నియమించవచ్చని పేర్కొన్నారు. కొంత మంది కావాలనే ఈ విషయాన్ని వివాదంగా మార్చుతున్నారని, త్వరలోనే దీనికి పరిష్కారం చూపాలని డిమాండ్‌ చేస్తున్నారు.

■ ఈ విషయమై డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా గత జీఓలో గవర్నమెంట్‌ టీచర్స్‌ అని ఉందని, అయితే కోఆర్డినేటర్‌ నియామకంపై గత డీఈఓ విద్యాశాఖ కమిషనర్‌ సూచన మేరకు పోస్టును కేటాయించామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. దీనిపై ఒక వర్గం గవర్నమెంట్‌ బాడీకి ఇవ్వాలని, మరో వర్గం లోకల్‌ బాడీకి ఇవ్వాలని ఫిర్యాదులు చేస్తున్నారని, ఈ విషయమై కమిషనర్‌కు ఫైల్‌ పంపించామన్నారు. అక్కడి నుంచి స్పష్టత వస్తే ఎవరిని కేటాయించాలనేది తెలుస్తుందని చెప్పారు.

సొరంగంలో కొనసాగుతున్న మట్టి తొలగింపు


సొరంగం లోపలకు లోకో ట్రైన్‌లో వెళ్తున్న సహాయక సిబ్బందితో ప్రత్యేక అధికారి


49 రోజులుగా శ్రమిస్తున్నా.. లభ్యం కాని ఆరుగురి ఆచూకీ

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం లోపల కన్వేయర్‌ బెల్టు పొడిగింపు పనులు దాదాపు పూర్తి అయ్యాయి. సొరంగం ప్రమాదం జరిగి శుక్రవారం నాటికి 49 రోజులు అవుతోంది. ప్రభుత్వ విపత్తు నిర్వహణ విభాగం, రెస్క్యూ టీములు, టన్నెల్‌ నిపుణుల సమన్వయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. సహాయక బృందాలు నాలుగు రోజులు శ్రమించి 13.730 కిలోమీటరు నుంచి 13.800 కిలోమీటరు వరకు కన్వేయర్‌ బెల్టు జాయింట్‌ చేసి పొడిగించారు. మట్టి, బురద, రాళ్లు, టీబీఎం భాగాలు తొలగింపు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. తొలగించిన మట్టి ఎస్కవేటర్లతో కన్వేయర్‌ బెల్టుపై ఎత్తిపోస్తున్నారు. ఐదు ఎస్కవేటర్లతో సొరంగం లోపల తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్వకాలకు ఆటంటకంగా మారిన నీటి ఊటను ఎప్పటికప్పుడు భారీ మోటార్ల సహాయంతో సొరంగం బయటకు పంపింగ్‌ చేస్తున్నారు. మిగిలిన 70 మీటర్ల ప్రదేశంలో శిథిలాలను పూర్తిగా తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. సొరంగం పైకప్పు కూలిన అత్యంత ప్రమాదకరమైన 13.936 కిలోమీటరు ప్రదేశంలో ఇప్పట్లో తవ్వకాలు జరిపే అవకాశం లేదని సహాయక సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులో ఈ పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.


సొరంగం లోపల కొనసాగుతున్న సహాయక చర్యలు

■ సొరంగం ప్రమాద ప్రదేశంలో మట్టి, బురద తవ్వకాలు కొనసాగుతున్నాయని, సహాయక చర్యలు ముమ్మరం చేశామని ప్రత్యేక అధికారి శివశంకర్‌ లోతేటి అన్నారు. శుక్రవారం సొరంగం ఇన్‌లెట్‌ వద్ద జేపీ కార్యాలయంలో సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారి ఆచూకీ కొనుకొనేందుకు సహాయక బృందాలు ఎంతో శ్రమిస్తున్నాయన్నారు. సొరంగం లోపల భారీగా పేరుకపోయిన మట్టి, బురద, రాళ్లు, టీబీఎం భాగాలను కత్తిరించే పనులు నిరాంతరాయంగా కొనసాగుతున్నాయని, తవ్వకాలు చేపట్టి ప్రదేశం నుంచి మట్టిని కన్వేయర్‌ బెల్టు ద్వారా సొరంగం బయటకు తరలిస్తున్నామన్నారు. ఉబికి వస్తున్న నీటి ఊటను భారీ మోటార్లతో పంపింగ్‌ చేస్తూ బయటకు తరలించే పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్‌, విజయ్‌కుమార్‌, జేపీ కంపెనీ సీనియర్‌ ప్రాజెక్టు ఇంజినీర్‌ సంజయ్‌కుమార్‌ సింగ్‌, సింగరేణి మైన్స్‌ రెస్క్యూ జనరల్‌ మేనేజర్‌ బైద్య, ఎన్‌డీఆర్‌ఎఫ్‌ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్‌ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభం


పచ్చిరొట్ట సాగు (ఫైల్‌)


వర్మీ కంపోస్టు ఎరువులో వానపాములు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియానాయక్‌, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

అలంపూర్‌: పూర్వం సేంద్రియ ఎరువులతోనే వ్యవసాయం జరిగేది. అప్పట్లో రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులతో పంటలు పండించే వారు. కాలక్రమేణ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార దిగుబడులు పెంచడానికి ఆధునిక వంగడాలతో పాటు రసాయనాలు వినియోగించుకోవాల్సిన అవసరం నెలకొంది. రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడుతూ.. దిగుబడులు పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి సేంద్రియ ఎరువులతో పంటల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్‌ సూచించారు. వీటి వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు.

రసాయనాల వాడకంతో కలిగే నష్టాలు..

పంటల సాగులో విచక్షణరహితంగా బస్తాల కొద్దీ రసాయన ఎరువులను కుమ్మరించడంతో ఆ మందులను తట్టుకునే స్థాయి పంటలకు ఆశించే పురుగుకు పెరుగుతుంది. కాలక్రమేణ పురుగులు, తెగుళ్ల బెడద అధికమవుతుంది. మరోవైపు సాగు ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. ఆహార ఉత్పత్తుల నాణ్యత తగ్గిపోతుంది. సరైన అవగాహన లేకుండా రసాయనాల వాడకం వల్ల వాటి అవశేషాలు నీటిలో, సాగు నేలలో కలిసి కలుషితమవుతాయి. మిత్ర కీటకాలు నశించి పర్యావరణంలో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. వీటి నివారణ కోసం వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనాలు లేకుండా చూసుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యవసాయ ఒప్పందాల ప్రకారం మార్కెట్‌లో పోటీకి మన ప్రాంత రైతులు నిలవాలంటే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి.

సేంద్రియ విధానం..

సాగులో లింగాకర్షన బుట్టలు వాడాలి. పరిమితులకు లోబడి బీటీ వైరస్‌ శిలీంధ్రాన్ని వాడాలి. అందుకు గంధకం, రాగి ఉత్పత్తులు వాడవచ్చు. వృక్ష సంబంధ నూనెలను కొన్ని జాగ్రత్తలతో వినియోగించవచ్చు. వేప సంబంధిత ఉత్పత్తులు, పచ్చిరొట్ట, వర్మీ కంపోస్టు ఎరువులపై దృష్టి పెట్టాలి. పంటల నుంచి వచ్చే బూడిద, జీవన ఎరువులు, జిప్సం పంటల్లో వాడుకోవచ్చు.

తక్కువ ఖర్చు..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించారు. వానపాములు, పశువులు, కోళ్ల ఎరువుతో పాటు పచ్చి ఆకులు, పిండి చెక్కలు వినియోగిస్తున్నారు. తద్వారా నాణ్యమైన, రుచికరమైన ఉత్పత్తులను పండించి దేశానికి అందించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయశాఖ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు సైతం అందుబాటులో ఉండే వర్మీ కంపోస్టు బెడ్స్‌ను రూ. 5వేల సబ్సిడీపై రైతులు పొందవచ్చు. వ్యవసాయశాఖ పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలను 5శాతం సబ్సిడీపై అందిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

అంతర్జాతీయ మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులు నిలవాలంటే నిబంధనలు పాటించాల్సిందే. మన ప్రాంతంలోని నేలల్లో సేంద్రియ కర్బణం చాలా వరకు తగ్గిపోయి దిగుబడుల్లో రైతులు ఒడిదుడుకులను ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. అనేక చోట్ల ఒక శాతం కర్బణం ఉన్నట్లు తెలుస్తోంది. సేంద్రియ కర్బణం పెంచడానికి కృషి చేయాలి. సేంద్రియ సాగుతో ఆహార ఉత్పత్తులు సాధించాలంటే ప్రపంచ దేశాలతో పాటు మన ప్రాంతంలో కూడా సేంద్రియ వ్యవసాయంచేసే రైతుల కమతాల్ని పరిశీలించి.. వారికి ధ్రువపత్రం జారీ చేయడానికి కొన్ని ప్రమాణాలను ప్రభుత్వం నిర్దేశించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆహార ధాన్యాలు సేంద్రియ ఉత్పత్తిగా గుర్తించాలంటే.. సాగులో అనేక ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. సేంద్రియ వ్యవసాయ ఉద్యమాల అంతర్జాతీయ సమాఖ్య కొన్ని సాగు ప్రమాణాలను సూచించింది. ఈ మేరకు అనేక దేశాల్లో కొద్దిపాటి తేడాతో ప్రమాణాలు పాటిస్తున్నారు. నాటే విత్తనాల నుంచి యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి, ప్యాకింగ్‌ వరకు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

- రూ.3.50 లక్షలు టోకరా

నవాబుపేట: కాంట్రాక్ట్‌ ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.3.50 లక్షలు కాజేసిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని దయాపంతులపల్లికి చెందిన వడ్ల రాఘవేంద్రాచారికి కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పిస్తామంటూ మండలంలోని మరికల్‌కు చెందిన నీలి ప్రసాద్‌, నీలి వెంకటేశ్‌ 2020లో రూ.3.50 లక్షలు తీసుకున్నారు. ఐదేళ్లుగా కాలయాపన చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు శుక్రవారం ఫిర్యాదు చేశారని.. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

సంతకం ఫోర్జరీ.. క్రిమినల్‌ కేసు నమోదు

నారాయణపేట: తన సంతకం ఫోర్జరీ చేసి తండ్రి నుంచి రావాల్సిన భూమిని దక్కకుండా చేసిన కొడ్లి సతీష్‌, కొడ్లి జగదీశ్‌ను వెంటనే అరెస్ట్‌ చేసి జైలుకు పంపాలని మద్దూర్‌ మండలం దోరేపల్లికి చెందిన అవుటి కవిత శుక్రవారం దామరగిద్ద పోలీసులను కోరారు. వివరాల్లోకి వెళ్తే.. దామరగిద్దకు చెందిన కోడ్లి మల్లికార్జున్‌ 2016, నవంబర్‌ 16న మృతిచెందాడు. ఆయనకు గ్రామ శివారులో 5.33 ఎకరాల భూమి ఉంది. ఆయనకు ఇద్దరు భార్యలుండగా మొదటి భార్య కోడ్లి ద్రాక్షమ్మ 2009లో మృతిచెందింది. ఆమెకు కుమారులు జగదీశ్‌, సతీష్‌ స్థానిక రెవెన్యూ అధికారుల సహకారంతో రెండో భార్య, ఆమె కుమార్తెకు తెలియకుండా వారి సంతకాలు ఫోర్జరీ చేసి విరాసత్‌ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెండో భార్య శ్యాంబాయి కుమార్తె కవిత ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు దామరగిద్ద ఎస్‌ఐ క్రిమినల్‌ కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రిజర్వాయర్‌ పనులను అడ్డుకునేందుకు వెళ్లిన నిర్వాసితుల అరెస్ట్‌

జడ్చర్ల: ఉదండాపూర్‌ రిజర్వాయర్‌ నిర్మాణ పనులను అడ్డుకునేందుకు వెళ్లిన పలువురు నిర్వాసితులను పోలీసులు శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకుని రాత్రికి వదలిపెట్టారు. తమ సమస్యలు పరిష్కరించిన తరువాతే రిజర్వాయర్‌ పనులను చేపట్టాలని కొన్ని రోజులుగా నిర్వాసితులు ఆందోళనలు చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో గ్రామంలో సమావేశమై చర్చించుకుంటున్న సమయంలో ప్రాజెక్ట్‌ పనులు మొదలు పెట్టారన్న సమాచారం రావడంతో అడ్డుకునేందుకు కొందరు బైక్‌లపై పనులు జరుగుతున్న రిజర్వాయర్‌ కట్టపైకి వెళ్లారు. అప్పటికే మాటు వేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలేపల్లి సెజ్‌ మీదుగా జడ్చర్ల డీటీసీకి తరలించారు. ఫోన్లను స్వాధీనం చేసుకొని తిరిగి రాత్రికి విడిచిపెట్టారు. అనంతరం రిజర్వాయర్‌ పనులు మొదలయ్యాయి. తమకు ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ, తదితర సమస్యలు పరిష్కారం చేసిన తరువాతే పనులు మొదలు పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినా తమను పోలీసుల చేత అరెస్ట్‌ చేయించడం తగదని నిర్వాసితులు శేఖర్‌, శ్రీను, ఐయిలప్ప, రామకృష్ణ, ఆంజనేయులు, తదితరులు తెలిపారు.

నేటినుంచి ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నీ

- తెలుగు రాష్ట్రాల నుంచి నాలుగు జట్ల హాజరు
- రౌండ్‌రాబిన్‌ లీగ్‌ పద్ధతిలో మ్యాచ్‌లు


ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సభ్యులు

మహబూబ్‌నగర్‌ క్రీడలు: జిల్లా కేంద్రంలో శనివారం, ఆదివారాల్లో ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నీ నిర్వహించనున్నారు. స్థానిక మెయిన్‌ స్టేడియంలో ఫుట్‌బాల్‌ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి నాలుగు జట్లు పాల్గొంటున్నాయి. విశాఖపట్నం, నెల్లూరు, ఏపీ స్పోర్ట్స్‌ స్కూల్‌ పూర్వ విద్యార్థులు, మహబూబ్‌నగర్‌ జట్లు టోర్నీకి హాజరవుతున్నాయి. 40 ఏళ్లకు పైబడి క్రీడాకారులు ఫుట్‌బాల్‌ మ్యాచులు ఆడనున్నారు. రౌండ్‌ రాబిన్‌ లీగ్‌ పద్ధతిలో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. టోర్నీలో ఆరు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఎక్కువ పాయింట్లు సాధించిన జట్లు విన్నర్‌, రన్నరప్‌గా నిలుస్తాయి. మొదటిసారిగా జిల్లా కేంద్రంలో ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నమెంట్‌ నిర్వహిస్తుండడంగా విజయవంతం కోసం ఫుట్‌బాల్‌ సంఘం ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మెయిన్‌ స్టేడియంలో ఫుట్‌బాల్‌ ఇన్విటేషన్‌ టోర్నీ ఏర్పాట్లను శుక్రవారం జిల్లా ఫుట్‌బాల్‌ సంఘం ప్రధాన కార్యదర్శి భానుకిరణ్‌, ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నమెంట్‌ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ ఇమ్మాన్యుయెల్‌ జేమ్స్‌, రామకృష్ణ, శశిధర్‌, రాజశేఖర్‌, నాగేశ్‌, కె.రాజేందర్‌ పరిశీలించారు. ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నమెంట్‌ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. టోర్నీ విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు. టోర్నీ ప్రారంభోత్సవంలో జిల్లా ఫుట్‌బాల్‌ సంఘం అధ్యక్షులు, సీనియర్‌ క్రీడాకారులు ఎన్‌పీ వెంకటేశ్‌, ఉపాధ్యక్షులు టీఎస్‌.రంగారావు, శంకర్‌లింగం, రాయల రమేష్‌, ప్రేమ్‌రాజ్‌ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

కేంద్రం జేబులో కృష్ణా ట్రిబ్యునల్‌


మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- పాలమూరు-రంగారెడ్డిని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: కృష్ణానదిలో నీటి వాటా తేల్చే కృష్ణా ట్రిబ్యునల్‌ కేంద్రం జేబులో ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయి పదేళ్లు గడుస్తున్నా.. నేటికీ కృష్ణానదిలో నీటి వాటా తేల్చకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇటీవల శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ లైనింగ్‌ పనులు చేస్తున్న ఏపీ ప్రభుత్వం తెలంగాణకు సాగునీటి కష్టాలు తెచ్చిపెట్టనుందని.. లైనింగ్‌ పనులతో కాల్వ సామర్థ్యం 44 వేల క్యూసెక్కుల నుంచి 89,762 క్యూసెక్కులకు పెరుగుతుందని వివరించారు. తెలంగాణ ప్రాజెక్టులు నాగార్జునసాగర్‌, కేఎల్‌ఐ, పాలమూరు ఎత్తిపోతల పథకాలకు నీటి లభ్యత తగ్గించే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ఏపీలోని టీడీపీ ప్రభుత్వం రాయలసీమ ప్రాంతంలో రాజకీయంగా బలపడటానికి నీటి లభ్యతను పెంచే ప్రాజెక్టులను వేగవంతం చేయాలని భావిస్తోందని.. ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం జలదోపిడీకి పాల్పడుతోందని మండిపడ్డారు. కేంద్రం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కేఆర్‌ఎంబీ ఏపీ ప్రయత్నాలను నిలువరించడం లేదని, తెలంగాణలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం ఈ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. రూ.100 కోట్లతో వట్టెం రిజర్వాయర్‌ నుంచి సిర్సవాడ కాల్వతో నల్లగొండ ప్రాంతానికి సాగునీటిని అందించవచ్చని.. కానీ ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం రిజర్వాయర్‌ నుంచి టన్నెల ద్వారా నీరు తరలించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇందుకుగాను మొదటి విడతగా రూ.1,300 కోట్లకు టెండర్‌ సైతం నిర్వహించారని.. తక్కువ ఖర్చుతో అయ్యే పనికి రూ.వందల కోట్లు వెచ్చించడం సీఎం బంధువులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకేనని ఆరోపించారు. వట్టెం రిజర్వాయర్‌ నుంచి నల్గొండకు నీరు తరలించేందుకు ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు, తనతో పాటు ఎంపీ సైతం సంతకం చేసి అప్పటి ముఖ్యమంత్రికి లేఖలు రాశామని గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్‌, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్‌, నాయకులు తిరుమల్‌, రహీం, గులాం ఖాదర్‌, కురుమూర్తి యాదవ్‌, నందిమళ్ల అశోక్‌, సునీల్‌ తదితరులు పాల్గొన్నారు.

పొన్నకల్‌ చెరువులో ఆటో బోల్తా


పొన్నకల్‌ చెరువులో పడిపోయిన ఆటో

త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న ప్రయాణికులు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌ చెరువులో ఆటో బోల్తాపడగా అందులో ఉన్న ఐదుగురికి ప్రాణాపాయం తప్పింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా.. రాచాలకు చెందిన దాసరి ఆంజనేయులు తన ఆటోలో దాసరి కురుమూర్తి, దాసరి నర్సింహులు, దాసరి వెంకటేశ్వరమ్మ, మడిగెల రవిశంకర్‌ను జాతీయ రహదారి వద్ద దింపేందుకు ఊళ్లో ఆటో ఎక్కించుకున్నాడు. దుబ్బపల్లి స్టేజీ దాటిన తర్వాత పొన్నకల్‌ నల్ల చెరువుకట్టపై మేకలు అడ్డువచ్చాయి. వాటిని తప్పించేందుకు డ్రైవర్‌ ఆంజనేయులు ఆటోను పక్కకు తిప్పగా ఆటో అదుపు తప్పి.. చెరువు కట్ట లోపలికి దూసుకెళ్లి బోల్తాపడింది. ఆటోలో ఉన్న కొందరు ఆటో నీళ్లలో పడేలోపే వెంటనే అందులోంచి పక్కకు దూకగా.. డ్రైవర్‌ ఆంజనేయులు, మరొకరు ఆటోతోపాటు నీళ్లలో మునిగిపోయారు. ఎలాగోలా ప్రయత్నించి ఆటోలోంచి బయటకు వచ్చి ఈదుతూ ఒడ్డుకు చేరుకున్నారు. డ్రైవర్‌ ఆంజనేయులు, మరొకరికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. అటుగా వెళ్తున్న కలెక్టర్‌ విజయేందిర ఘటనా స్థలం వద్ద ఆగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. తర్వాత స్థానికులు తాళ్ల సాయంతో ఆటోను బయటకు తీశారు. ఇదిలా ఉండగా.. అదుపు తప్పిన ఆటో చెరువు లోపలికి దూసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. చెరువుకు మరోవైపు దూసుకెళ్తే లోతైన పొలాల్లో పడి పెద్ద ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు.